పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎంపిక చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల, మనఊరు-మనబడి పథకాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను వేగంగా పూర్తి చేసి మౌలిక సౌకర్యాలను కల్పించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల, మన ఊరు-మన బడి కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 438 అమ్మ ఆదర్శ పాఠశాలలు, 315 మన ఊరు-మన బడి పథకాల్లో చేపట్టిన పనులకు సంబంధించి శాఖల అధికారులు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో, ఇన్‌ఛార్జి డీఈవో మందుల శ్రీరాములు, పంచాయతీరాజ్ ఈఈ విద్యాసాగర్, రహదారులు, భవనాల శాఖ ఈఈ భీమ్లానాయక్, సీపీవో సుబ్బారావు, ఇంజినీరింగ్ అధికారులు వీరభద్రం, నరేందర్, వరలక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జడ్పీ సీఈవో

మహబూబాబాద్: మహబూబాబాద్ జడ్పీ సీఈవోగా పురుషోత్తం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను కలెక్టరేట్‌లో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పురుషోత్తం కొన్ని రోజులు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారిగా విధులు నిర్వహించారు. నూతనంగా విధుల్లో చేరిన సీఈవోను కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

కలాం మాట.. విజయ బావుటా!

నేడు ప్రపంచ విద్యార్థుల దినోత్సవం



పూరి గుడిసెలో.. దీప కాంతుల్లో.. చదువుకున్న ఆ వ్యక్తి ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్త అవుతారని ఎవరూ ఊహించలేదు.. శాస్త్రసాంకేతిక రంగాల్లో అద్భుత విజయాలతో అభిమానం చూరగొని రాష్ట్రపతిగా అత్యున్నత పదవి అలంకరించారు. నిరంతర అధ్యయనం మహోన్నతుడిగా నిలిపింది. అంతేకాదు.. స్ఫూర్తి నింపేలా ప్రసంగాలు చేసి విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఆయనే దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం. నేడు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా 'ప్రపంచ విద్యార్థుల దినోత్సవం' జరుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో యువతలో స్ఫూర్తినింపే కలాం మాటలు.. ఆ బాటలో సాగుతున్న వారి స్ఫూర్తిగాథలతో 'ఈనాడు' ప్రత్యేక కథనమిది..

–ఈనాడు, మహబూబాబాద్

'యువత ఉద్యోగార్థుల నుంచి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి'

పరి'శ్రమ' ఫలించి.. ఉపాధి కల్పిస్తూ..



బీటెక్ విద్య నభ్యసించే యువకులు ఎవరైనా మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంగా ముందుకెళ్తారు. కానీ, మహబూబాబాద్ పట్టణానికి చెందిన భూక్య యశ్వంత్‌నాయక్ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడే వ్యాపారవేత్త కావాలని, కొంతమందికి ఉపాధి కల్పించాలని ఆలోచించారు. 2021లో రూ.35 లక్షలతో జూట్ సంచుల తయారీ పరిశ్రమ నెలకొల్పారు. ఎన్ని సమస్యలు వచ్చినా పట్టుదలతో ముందుకెళ్లి.. నేడు 20 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

'విజయం సాధించాలనే సంకల్పం, తగినంత బలం ఉంటే.. వైఫల్యం నన్ను ఎప్పటికీ అధిగమించదు'..

యావత్ దేశం గర్వించేలా..



ఓరుగల్లు యువకుడు ఇరిగేశి అర్జున్ చదరంగంలో ప్రపంచ చెస్ ఒలింపియాడ్ టైటిల్ కైవసం చేసుకొని యావత్ దేశం గర్వించేలా చేశారు.. 2018లో తెలంగాణ నుంచి గ్రాండ్‌మాస్టర్, 2022లో సూపర్ గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. 21 ఏళ్ల యువ క్రీడాకారుడు అపజయాలకు కుంగిపోకుండా ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తున్నారు.

'చిన్న లక్ష్యం నేరం.. లక్ష్యం గొప్పదై ఉండాలి'

అయిదు ఉద్యోగాలు సాధించి..



పలువురికి స్ఫూర్తిగా నిలిచేలా గొప్ప లక్ష్య శిఖరాన్ని ఛేదించేవారు ఎందరో.. అలాంటి వారిలో వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన వడ్లూరి రమ, ఉపాధ్యాయుడు విష్ణు దంపతుల కుమార్తె శ్వేత ఒకరు. ఈ-సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ఎంఈ పూర్తి చేశారు. పోటీ పరీక్షలు రాసి ఐదింటిలో ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ శాఖ కరీంనగర్ సబ్ డివిజన్‌లో ఏఈఈగా పనిచేస్తున్నా.. త్వరలోనే పాలిటెక్నిక్ లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరి ఎంతో మంది విద్యార్థులను ఆవిష్కర్తలుగా తీర్చుదిద్దుతానని చెప్పారు.

"జీవితంలో కష్టాలను ఎదుర్కొన్నప్పుడే విజయాలను ఆస్వాదించగలం"

వైకల్యాన్ని ఎదిరించి..



వరంగల్ జిల్లా కల్లెడకు చెందిన జీవాంజి దీప్తి పారాలింపిక్స్ కాంస్య పతక విజేత.. తనది నిరుపేద కుటుంబం.. పుట్టుకతోనే మానసిక వైకల్యం.. జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురవుతున్నా.. తల్లిదండ్రుల ప్రోత్సాహం, వ్యాయామ ఉపాధ్యాయులు, అథ్లెటిక్స్ కోచ్ శిక్షణలో విజేతగా నిలిచారు. లక్ష్యసాధనలో అడ్డంకులను పరుగుతో ఛేదించారు. అంకితభావంతో డిగ్రీ పూర్తి చేసి ఈ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ఈ ఏడాది అంశం

'విద్యార్థులు చదువు, భవిష్యత్తును తీర్చిదిద్దుకునేలా బాధ్యత ఇద్దాం.. వారిలో శక్తిసామర్థ్యాలను వెలికితీసి నాయకులుగా, ఆవిష్కర్తలుగా ఎదిగేలా ప్రోత్సహిద్దాం..

'కల అంటే మీరు నిద్రపోతున్నప్పుడే చూసేది కాదు.. అది మిమ్మల్ని నిద్రపోనివ్వదు'

పేదరికం అడ్డుకాలేదు



పాఠశాల స్థాయిలో గురువు మొగిలి స్ఫూర్తితో తానూ ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలని.. కలలు గని పట్టుదలతో చదివి ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరబోతున్నారు.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన పల్లకొండ శిల్ప.. నిరుపేద కుటుంబానికి చెందిన రవి, భాగ్యల కూతురు.. ఊరిలో సొంతిల్లు కూడా లేదు. చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వ బడుల్లో చదువుకుని గురువు సూచనలతో ఇంటర్ తర్వాత టీటీసీ చదివి ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయురాలైంది.

'సైన్స్ అనేది మానవాళికి ఒక అందమైన బహుమతి.. మనం దాన్ని వక్రీకరించకూడదు'

ఆవిష్కరణలు అదుర్స్



మహబూబాబాద్ మండలం కంబాలపల్లికి చెందిన షణ్ముఖరావు చదువుకున్నది పదో తరగతే.. కానీ, గొప్ప ఆవిష్కర్త.. పత్తి, మిర్చిలో కలుపు మొక్కలను తొలగించడానికి యంత్రాన్ని తయారు చేయాలనే ఆలోచనతో 2019లో 'మోనోవీల్ మ్యాన్‌రైడింగ్ పవర్ వీడర్'ను తయారు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం పొందారు. ఇప్పటివరకు ప్రజలకు ఉపయోగపడే ఎనిమిది రకాల ఆవిష్కరణలు తయారు చేశారు.

ఉమ్మడి జిల్లాలోని విద్యార్థుల వివరాలు	
పాఠశాలల విద్యార్థులు	4,63,500
జూనియర్ కళాశాలల్లో	1,03,100
డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీలో	1,19,000
పీజీ విద్యార్థులు	11,600

నూతన ఉపాధ్యాయులకు నేడు కౌన్సెలింగ్

మానుకోట, న్యూస్‌టుడే: జిల్లాలో డీఎస్సీ-2024లో ఎంపికైన ఉపాధ్యాయులు ఇప్పటికే నియామక పత్రాలు పొందారు. వీరికి పాఠశాలలను కేటాయించి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్ తెలిపారు. నియామక పత్రాలు పొందిన ఉపాధ్యాయులందరూ జిల్లా కేంద్రంలోని శనగపురం రహదారిలో ఉన్న ఫాతిమా హైస్కూల్‌కు స్కూల్ అసిస్టెంట్, పండిట్, వ్యాయామ ఉపాధ్యాయులు ఉదయం 10.30, ఎస్జీటీలు 11 గంటలకు హాజరుకావాలన్నారు. ఒరిజినల్ నియామకపు పత్రం, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకుని రావాలన్నారు. ఖాళీలు, మెరిట్ వివరాలు www.deomahabubabad.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం


డోర్నకల్ పోలీసుస్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

డోర్నకల్, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు రాత్రి పూట పకడ్బందీ గస్తీ చేపట్టాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్ని విభాగాల పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. డోర్నకల్ ఠాణాను సోమవారం ఆయన తనిఖీ చేశారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లు చూశారు. కేసుల పురోగతికి తోడు సీసీ కెమెరాల పని తీరుని ఆరా తీశారు. ఈ-కాప్స్ రైటర్ గదిని సందర్శించారు. ఆవరణలో మొక్కలు నాటారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి జరిగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపడానికి నిఘా పెంచి వ్యూహాత్మక కార్యాచరణ అమలు పరచాలన్నారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్ష జరిపారు. డయల్ 100కి ఎవరైనా ఫోన్ చేస్తే వెంటనే సంఘటనాస్థలికి చేరుకోవాలన్నారు. ప్రజల అర్జీలకు పరిష్కారం చూపడానికి నిష్పక్షపాత విచారణ జరపాలని దిశానిర్దేశం చేశారు. పై అధికారులు అప్పగించే బాధ్యతలను నిర్వహించే విషయంలో అలసత్వానికి తావు ఇవ్వకూడదని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతుండటం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి నివారణకు క్రమం తప్పకుండా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు జరపాల్సిన అవసరం ఉందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలన్నారు. అంతకుముందు జిల్లా ఎస్పీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. డీఎస్పీ తిరుపతిరావు, డోర్నకల్ సీఐ రాజేష్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వంశీధర్ ఉన్నారు.

5,6 తేదీల్లో రాష్ట్రస్థాయి సమ్మేళనం

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) రాష్ట్ర స్థాయి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా హరినాయక్ కోరారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద గిరిజన సంఘం రాష్ట్ర స్థాయి సమ్మేళనం కరపత్రాల ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. గిరిజన సంఘం వ్యవస్థాపకుడు అమరజీవి గుగులోతు ధర్మానాయక్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర స్థాయి సంఘం సమ్మేళనాన్ని ఖమ్మంలోని భక్త కళక్షేత్రంలో నవంబర్ 5, 6 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న, ఉపాధ్యక్షుడు మాలోతు కిషన్, గౌరవ అధ్యక్షుడు సీతారాంనాయక్ తదితరులున్నారు.

ఎవరికి ఫోన్ చేయాలబ్బా!



వానరం చరవాణి వీక్షిస్తుందని ఆశ్చర్యపోతున్నారా..? నిజమే మరి.ఓ కోతి ప్రయాణికురాలి చరవాణి లాక్కెళ్లిన సంఘటన మానుకోట రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటుచేసుకొంది. సెల్‌ను కొద్దిసేపు పరిశీలించింది. సదరు మహిళ ఆ కోతివైపు సమోసాలను విసిరివేయడంతో వానరం చేతిలోని సెల్‌ను వదిలివేసింది. చరవాణిని కోతి వీక్షిస్తున్న తీరును ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు.

– న్యూస్‌టుడే, నెహ్రూసెంటర్


పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వినతి



మానుకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డీఏతో అన్ని రకాల బిల్లులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ టీఎస్‌సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఖజానా అధికారి సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. జులై 2022 నుంచి ఈ-కుబేరులో పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్ఐఎస్ఐ, సరెండర్ లీవు, సప్లిమెంటరీ జీతాల బిల్లులు, 2024 మార్చి నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల గ్రాట్యుటీ పెన్షన్ కం మ్యుటేషన్, సంపాదిత సెలవులను నగదుగా మార్చుకునే బిల్లులను సత్వరమే చెల్లించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి, జిల్లా అధ్యక్షుడు పూసపాటి నాగముని, రోహిత్, రఫిక్ వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

పత్తి రైతుల కోసం వాట్సప్ నంబరు!

ఈనాడు, వరంగల్



మార్కెటింగ్ శాఖ తీసుకొచ్చిన వాట్సప్ అప్లికేషన్

పత్తి రైతుల కోసం మార్కెటింగ్ శాఖ ఈ ఏడాది ఒక వాట్సప్ నెంబర్‌ను (8897281111) అందుబాటులోకి తీసుకొచ్చింది. కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో ప్రవేశపెట్టిన ఈ వాట్సప్ విధానం వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయంటోంది. ఈ అప్లికేషన్ వల్ల అన్నదాతలు పత్తి పంటతో రోజుల తరబడి సీసీఐ కేంద్రాలున్న మిల్లుల వద్ద వేచి చూసే పని ఉండదు. ఏ కేంద్రం వద్ద ఎంత సరకు ఉంది, వేచి చూడాల్సిన సమయం ఎంతనేది కూడా ముందే తెలుస్తుంది. దీని వల్ల రైతులు తమ దగ్గర్లోని కేంద్రంలో ఎక్కడ వేచి చూసే సమయం తక్కువుందో అక్కడికి వెళ్లే విధంగా ఈ వాట్సప్ అప్లికేషన్ రూపొందించారు. పైన పేర్కొన్న మొబైల్ నెంబర్‌తో వాట్సప్‌లో రైతులు 'హెచ్ఐ' (హాయ్) అని టైప్ చేస్తే వెంటనే 'వన్ సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో అది తెరచుకుంటుంది. ఇందులో ఇంగ్లిష్, తెలుగు, హిందీ మూడు భాషల్లో కావాల్సిన దాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు తెలుగు ఎంపిక చేసుకుంటే 'అర్హత తనిఖీ', 'విక్రయ సమాచారం', 'తక్‌పట్టి వివరాలు', 'కేంద్రంలో వేచి ఉండే సమయం', ఇలా నాలుగు ఐచ్ఛికాలు కనిపిస్తాయి. రైతులు సాగు చేసిన పత్తి వివరాలు, రైతు ఎన్ని క్వింటాళ్ల వరకు విక్రయించుకునేందుకు అర్హత ఉందనేది మొదట కనిపిస్తుంది. ఒకవేళ రైతులు పత్తి విక్రయిస్తే ఎంత సరకు విక్రయించారు, చెల్లింపు డబ్బుల వివరాలు కనిపిస్తాయని మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి.

బాధిత కుటుంబానికి బాసట

● దివ్యాంగ సోదరులకు కిరాణ దుకాణం ఏర్పాటు చేసిన సంస్థ


వ్యాధి ప్రాణాంతకం.. నడవలేని దైన్యం

మార్చి 4న ప్రచురితమైన కథనం



బ్రాహ్మణకొత్తపల్లిలో స్వచ్ఛంద సంస్థ నెలకొల్పిన కిరాణ దుకాణం

ఈనాడు కథనానికి స్పందన

నెల్లికుదురు, న్యూస్‌టుడే: కండరాల క్షీణత వ్యాధితో కాళ్లకు వైకల్యం ఏర్పడి దివ్యాంగులుగా మారి ప్రాణాంతక వ్యాధితో మంచానికి పరిమితమైన సోదరులకు ప్రవాస భారతీయులకు చెందిన హోప్4 సంస్థ ప్రతినిధులు కిరాణ దుకాణం ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. నెల్లికుదురు మండలంలోని బ్రాహ్మణ కొత్తపల్లికి చెందిన మాదగాని నరేష్, సుమన్ నిరుపేద కుటుంబంలో జన్మించి పదోతరగతి వరకు ఆరోగ్యంగా ఉండి, యుక్త వయసు రాగానే కండరాల క్షీణత వ్యాధితో కాళ్లకు వైకల్యం ఏర్పడి దివ్యాంగులుగా మారారు. తండ్రిని కోల్పోగా తల్లి కుటుంబాన్ని పోషించలేక వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబ దీనస్థితిపై 2024 మార్చి 4వ తేదీన 'ప్రాణాంతక వ్యాధి..నడవలేని దైన్యం' కథనాన్ని 'ఈనాడు'లో ప్రచురితమైంది. వెంటనే స్పందించిన హైదరాబాద్‌కు చెందిన రఘు అరికపూడి సేవా ట్రస్టు బాధిత కుటుంబాన్ని సందర్శించి నాలుగు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను అందించింది. ట్రస్టు ప్రవాస భారతీయులకు చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ 'హోప్4 స్పందన' వారి సహకారంతో గుజరాత్ రాష్ట్రానికి చెందిన దాహ్యాభయ్ పటేల్ ఆర్థిక సహకారంతో రూ.1.50లక్షలు వెచ్చించి మాదగాని నరేష్, సుమన్ ఇంటివద్ద కిరాణ దుకాణం ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. సంస్థ ఉపాధ్యక్షుడు లక్ష్మీనరసింహ, సంస్థ సభ్యులు మహేష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి ఉపాధిని కల్పించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


భూగర్భ శోకం!

భారీ వర్షాలు కురిసినా నీటిమట్టం తగ్గుదల


నెల కిందట పొంగి ప్రవహించిన మున్నేరు

మానుకోట, మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆగస్టు 31, సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లాలో విపరీతంగా భారీ వర్షాలు కురిశాయి. పలు మండలాల్లో వరదలు ముంచెత్తాయి. చిన్నగూడూరు, ఇనుగుర్తి లాంటి మండలాల్లో ఊహించని విధంగా వర్షపాతం అత్యధికంగా నమోదైంది. వరద నీటితో అనేక చెరువులకు నిండాయి. ఎన్నో వాగులు పొంగి ప్రవహించాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి జిల్లా సగటు భూగర్భ జలాలమట్టం గత ఏడాది కంటే గణనీయంగా పెరుగుతుందని.. భూగర్భ జలసంపద సమృద్ధిగా ఉంటుందని భావించారు. తాజాగా భూగర్భ జలశాఖ గణాంకాలను పరిశీలిస్తే ఆ అంచనా వట్టిదేనని తేలిపోయింది. భూఉపరితలంపై జలాల పరుగులే తప్ప భూగర్భంలోకి ఇంకినట్లు కనిపించటం లేదని భావిస్తున్నారు. గత సెప్టెంబర్‌లో జిల్లా సగటు భూగర్భ జలమట్టం 2.51 మీటర్లు ఉండగా ఈ ఏడాది ఈ నెలలో 1.70 మీటర్లు మాత్రమే ఉన్నాయి. భారీ వర్షాలు కురిసినా వరద ప్రవాహంతో అనేక చెరువులకు గండ్లుపడి ఆయా చెరువుల్లోని నీరంతా బయటికి వెళ్లిపోయింది. పలు వాగులు పొంగి ప్రవహించినా వారం రోజుల్లోనే నీటి ప్రవాహం బాగా తగ్గిపోయి రాళ్లు తేలి కనిపిస్తున్నాయి.

నిరాశే మిగిలింది.. ఈ సంవత్సరం జిల్లాలో వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన జూన్ నుంచి ఆగస్టు మూడో వారం వరకు వర్షపాతం అంతంత మాత్రంగానే ఉంది. ఆగస్టు నెలాఖరు, సెప్టెంబర్‌లో కొద్దిరోజులు కురిసిన భారీ వర్షాలు వరదల రూపందాల్చి పంటలకు నష్టాన్ని కలిగించాయి. పైగా జల వనరుల్లో నీరు నిలువకుండా చేశాయి. ఫలితంగా ఒక కొత్తగూడ మండలంలో భూగర్భ జల సంపదలో స్వల్ప పెరుగుదల తప్ప మిగతా 17 మండలాల్లో భూగర్భ జల నిధి నిరాశనే కలిగిస్తోంది.



గ్రామసభలతోనే ఇందిరమ్మ కమిటీలను నెలకొల్పాలి

కొత్తగూడ, న్యూస్‌టుడే: గ్రామసభల ద్వారానే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పేర్కొన్నారు. సోమవారం కొత్తగూడలో జరిగిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాన్ని పార్టీ సొంతంగా చేయకుండా ఉండేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ కమిటీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు లేకుండా ఏర్పాటు చేయాలని కోరారు. ఇందిరమ్మ కమిటీలపై జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు వెంకటయ్య, శ్రీశైలం, నర్సక్క, యాదగిరి, లింగన్న, బుచ్చిరాములు, తదితరులు పాల్గొన్నారు.

లిల్లీ తోట.. లాభాల బాట

ఆదర్శం

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం పటేలు గూడెం గ్రామానికి చెందిన పెండ్లి ప్రభాకర్ పూల తోటల సాగులో ఆదర్శంగా నిలుస్తున్నారు. బీఈడీ పూర్తి చేసినా.. ఉద్యోగం కంటే వృత్తినే నమ్ముకున్నారు. తల్లి దండ్రులు రమేశ్, అనసూయ చేయూతను అందిస్తుండగా 18 ఏళ్లుగా మల్లెతోట సాగు చేప ట్టారు. ఈ ఏడాది 15 గుంటల విస్తీర్ణంలో బంతిపూల సాగు, 30 గుంటల విస్తీర్ణంలో నేలసంపంగి(లిల్లీ పూలు) సాగు చేశారు. పూలు కోతకు వచ్చి లాభాల బాట పట్టారు. ఈ సందర్భంగా ‘రైతే రాజు’తో మాట్లాడారు. గత సంవత్సరం జులైలో నేలను గుల్లగా దుక్కి చేశారు. 4 ట్రాక్టర్ల పశువుల ఎరువు చల్లుకు న్నారు. అడుగు దూరం, అడుగు వెడల్పుతో బోదెలు చేసుకున్నారు. వికారాబాద్‌లో రైతు వద్ద నుంచి ఒక్కో బ్యాగ్ రూ.వెయ్యి చెల్లించి 20 బ్యాగుల నేలసంపంగి పూల దుంప(గడ్డ)లను కొనుగోలు చేశారు. వాటిని అడుగు దూరంతో నాటుకున్నారు. నెలకోసారి కంపోస్టు, మిశ్రమ ఎరువులు వేస్తున్నారు. రసం పీల్చే పురుగు నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఆరు నెలల్లో పూత ప్రారంభమైంది. ఒక్కసారి నాటితే వరసగా మూడేళ్ల పూలు పూస్తుంటాయి. పూలను ఉదయమే కోయాల్సి ఉంటుంది. హైదరాబాద్ వంటి మార్కెట్‌కు తరలించాలంటే మరింత వేకువజామున పూలు కోస్తున్నారు. వ్రతాలు, పండగలు, పెళ్లిళ్ల సీజన్‌లో కిలో రూ.150 వరకు సాధారణంగా కిలో.రూ.120 వరకు ధర లభిస్తుంది. రోజుకు 20 నుంచి 30 కిలోల దిగుబడి వస్తుంది. 6 నెలల్లోనే పెట్టిన పెట్టుబడులు సాధించారు. రోజుకు రూ.1500 వరకు ఆదాయం లభిస్తుంది. పెట్టుబడులు పోగా ఏటా రూ.5 లక్షల వరకు ఆదాయం ఉంటుంది. ఇద్దరు కూలీలు సరిపోతున్నారు. తక్కువ విస్తీర్ణంలో నేలసంపంగి సాగు చేపట్టి ఎక్కువ లాభాలు పొందుతున్నారు.



నేల సంపంగి పూలు చూపుతున్న పెండ్లి ప్రభాకర్

ఆశయం ఘనం.. ఆచరణలో విఫలం!

జనగామ, న్యూస్‌టుడే: పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, పట్టణ పేద మహిళలకు ఉపాధి మార్గం చూపించే ఆశయంతో ప్రారంభించిన ఓ పథకం మూలకు చేరింది. పట్టణ మహిళల ఆర్థిక ప్రగతికి మెప్మా ఆధ్వర్యంలో వారి సొంత, కొత్త వ్యాపారాలకు రుణాలిస్తున్నారు. ఇటు ఆదాయం, అటు పర్యావరణానికి హితంగా ఉండేలా ప్రారంభించిన ‘స్టీల్ బ్యాంకు’ పథకం ఉమ్మడి జిల్లాలో ఆచరణలో విఫలమైంది. పట్టణ ప్రాంతాలకు సమస్యగా

ఇలా ప్రారంభమైంది..

మహాత్మా గాంధీ జాతీయ నిధి(ఎంజీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్రంలో పురపాలికలున్న జిల్లా కేంద్రాల్లో స్టీలు సామగ్రి(స్టీల్ బర్తన్) బ్యాంకులను ఏర్పాటు చేశారు. మొదటి దశలో రూ.1.50 లక్షల నుంచి రూ.1.75 లక్షల వరకు పెట్టుబడిని రుణ రూపేణ సమకూర్చారు.. ఇందులో భాగంగా గత సంవత్సరం జనగామ, మహబూబాబాద్ జిల్లా కేంద్రాల్లోని పురపాలికల్లో ఒక్కొక్కటి, వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో మూడు బ్యాంకులను ప్రారంభించారు. నిర్వహణకు ఆసక్తి కలిగిన మహిళా సంఘాలను ఎంపిక చేసి, తక్కువ వడ్డీకి రుణం మంజూరు చేశారు. వసతి సౌకర్యం కల్పించి, కేంద్రం ద్వారా అద్దె ప్రాతిపదికన పాత్రలను స్టీల్ బ్యాంకు ద్వారా అందజేసేలా కార్యాచరణ రూపొందించారు. దశలవారీగా టెంట్లు, కుర్చీలు, బల్లలు ఇతర సామగ్రిని సమకూర్చుకుని వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవచ్చునని సూచించారు.

మూతపడిన స్టీల్ బ్యాంకు పథకం

మారిన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు నిషేధాజ్ఞలు విధించి జరిమానాలు వడ్డిస్తున్నారు. విందులు, ప్రత్యేక సందర్భాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వాడకం ద్వారా ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా పోగవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఉభయ తారకంగా ఉండేలా ‘స్టీల్‌బ్యాంకు’ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్లాస్టిక్ వస్తువుల స్థానంలోనే గతంలో మాదిరిగా స్టీలు, ఇండాలియం(అల్యూమినియం) గిన్నెలు, కంచాలు, గ్లాసుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు దీనిని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఒక వేడుకలో 8 కిలోల ప్లాస్టిక్ వాడకం తగ్గుతుందని పరిగనలోకి రావడంతో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సర్వే సంస్థల నుంచి ప్రశంసలు సైతం దక్కాయి.

సహకారం కొరవడి.. రుణం భారమై..

జనగామ పరిధిలో మహమ్మద్ స్లమ్‌లెవల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నర్మద, రజియాలు 17 రకాల వస్తువులతో స్టీల్ బ్యాంకును సెప్టెంబరు 2023లో ప్రారంభించారు. మున్సిపాలిటీ, ఇతర ప్రభుత్వ శాఖల నుంచి, మెప్మా సంఘాల నుంచి సహకారం అందలేదు. రవాణా, కూలీలకు చెల్లింపులు భారమయ్యాయి. దీంతో ఒకటి రెండు వేడుకలకు మినహా స్టీల్ సామగ్రిని సరఫరా చేయలేకపోయారు. రుణ భారం మీదపడింది. జయశంకర్ భూపాలపల్లిలో కేంద్రాన్ని ప్రారంభించలేదు. మహబూబాబాద్‌లో కొన్నాళ్లపాటు నడిచినా ప్రస్తుతం మనుగడలో లేదు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో కాజీపేట బ్యాంకు సామగ్రిని క్యాంటీన్ నిర్వహణలో వాడుతున్నారు. మరో రెండు చోట్ల ఖాయిలా పడ్డాయి.



జనగామలో ఇలా..

☛ పట్టణ సమాఖ్య నుంచి, రూ.1.50 లక్షలు రుణం తీసుకుని కేంద్రాన్ని ఏర్పాటు చేశాము. ఆశించిన సహకారం లేదు. దీంతో నిర్వహణ భారమైంది. ఆదాయం లేకున్నా, నెలనెలా వడ్డీతో పాటు కిస్తీ చెల్లించాల్సి వస్తోంది. రుణం రద్దు చేసి ఆదుకోవాలని జనగామ స్టీల్‌బ్యాంకు నిర్వాహకురాలు నర్మద తెలిపారు.

☛ ఆశించిన మేర సులభతర సేవలకు అవకాశం లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఇతర జిల్లాల్లో మాదిరి ఇక్కడా నిరుపయోగంగా ఉన్న స్టీల్ బ్యాంకు సామగ్రిని మహిళా శక్తి క్యాంటీన్‌కు సరఫరా చేసే అవకాశాన్ని కల్పించాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని జనగామ మెప్మా పీడీ హర్షవర్ధన్ వివరించారు.

డ్రోన్.. పిచికారీ అదిరెన్



కొత్తపల్లిలో డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేస్తున్న అజయ్‌కుమార్‌గౌడ్

రేగొండ, న్యూస్‌టుడే: ఇటీవల చాలా మంది రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో పంటలను సాగు చేస్తున్నారు. నిత్యం మిర్చి, పత్తి వంటి పంటలకు రోజు మార్చి రోజు పురుగు మందులు స్ప్రే చేస్తుంటారు. ఒకటి, రెండు ఎకరాలు పిచికారీ కోసం ఇద్దరు కూలీలు అవసరం ఉంటుంది. రైతుల కష్టాలకు చెక్ పెట్టేలా ఓ ప్రైవేటు సంస్థ సాయంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి అజయ్ కుమార్‌గౌడ్ డ్రోన్ కొనుగోలు చేశారు. తక్కువ ఖర్చు, అతి తక్కువ సమయంలో అన్ని రకాల పంటలపై స్ప్రే చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇది పని చేసే విధానాన్ని ఆయన ‘రైతేరాజు’కు వివరించారు. సుమారు రూ. 7 లక్షల నుంచి రూ.8 లక్షలతో డ్రోన్ కొనుగోలు చేశారు. బ్యాటరీలను ఒకసారి ఛార్జింగ్ చేస్తే సుమారు 3 ఎకరాల వరకు మందు పిచికారీ చేయవచ్చు. ట్యాంకులో సుమారు 12 లీటర్ల నీటిని, మందును నింపుకునేందుకు అవకాశం ఉంటుంది. ఒక్క ఎకరం సుమారు 4 నుంచి 5 నిమిషాల కాలవ్యవధిలో పిచికారీ పూర్తవుతుంది. రోజుకు సుమారు 20 నుంచి 25 ఎకరాలకు మందును స్ప్రే చేయవచ్చు. సాధారణంగా రైతులు ఎకరానికి సుమారు 120 నుంచి 150 లీటర్ల నీటిని ఉపయోగిస్తారు. అదే డ్రోన్‌తో కేవలం 12 లీటర్ల నీరు, తక్కువ మోతాదులో పురుగు మందు కలిపితే చాలు. సాధారణ పద్ధతిలో ఇద్దరు కూలీల ఖర్చులు(రూ.1200 నుంచి రూ.1500), ఒక్క రోజుకు 2 నుంచి 3 ఎకరాలు మాత్రమే మందు పిచికారీ చేస్తారు. మందు ఎక్కడా నేలపై కాకుండా కేవలం పంట మొక్కలపైనే పడుతుంది. తక్కువ నీరు, తక్కువ సమయం, తక్కువ మందు, తక్కువ ఖర్చుతో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూత, పురుగు మందుల వినియోగం అవుతుందని యువకుడు అజయ్‌కుమార్ గౌడ్ వివరించారు. ప్రస్తుతం ఒక రోజుకు సుమారు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ఆదాయం వస్తుందని చెప్పారు.

ప్రశ్న- సమాధానం

? వరిలో అగ్గి తెగులు సోకింది. నివారణ చర్యలు తెలపండి. –న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

– కె.తిరుపతిరెడ్డి, వంగర, భీమదేవరపల్లి

✔ ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథైయోలిన్ 1.5 మి.లీ లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ లేదా ట్రైసైక్లోజోల్, మ్యాంకోజెబ్ మిశ్రమ మందు 2.5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– డా.దిలీప్‌కుమార్, కోఆర్డినేటర్, వరంగల్ ఏరువాక కేంద్రం



మిరపలో.. జాగ్రత్తలు పాటిద్దాం..!

ముక్కోణం

రైతేరాజు

మానుకోట, న్యూస్‌టుడే : ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు ప్రాంతాల్లో మిరప తోటలకు వివిధ రకాల చీడపీడలు ఆశిస్తున్నాయి. ఈ తరుణంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను మల్యాల కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మాలతి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఈ.రాంబాబు తెలిపారు.

పైముడత: తామర పురుగులు ఆకుల అడుగు భాగంలో రసం పీల్చి ఆకులు పైకి పడవ ఆకారంలో ముడుచుకుంటాయి. నివారణకు ఒక లీటరు నీటికి ఫిప్రోనిల్ రెండు మి.లీ లేదా డయాఫెంథియురాన్ ఒకటిన్నర గ్రాములు లేదా ఎసిఫేట్ ఒకటిన్నర గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

వేరుకుళ్లు: మొక్కల వేర్లు నల్లబారి మొక్కలు చనిపోతాయి. మొదళ్లలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30(గ్రాములు+ప్లాంటోమైసిన్ ఒక గ్రాము 10 లీటర్ల నీటికి కలిపి లీటరు నీటికి కాపర్ హైడ్రాక్సైడ్ రెండు గ్రాములు లేదా మెటలాక్సిల్ రెండున్నర గ్రాములు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు మొక్కల వేర్లు బాగా తడిసేలా పోసుకోవాలి. ట్రైకోడెర్మా విరిడి రెండు కిలోలు+ 90 కిలోలు బాగా చితికిన పశువుల ఎరువుతో కలిపి వారం పది రోజుల పాటు బాగా మగ్గిన తర్వాత తెల్లని బూజు ఏర్పడుతుంది. ఆ మిశ్రమాన్ని మొక్కల మొదళ్లలో వేసుకోవాలి.

● **ఆకుముడత :** ఇది ఆశించిన మొక్కల ఆకులు కుచించుకుపోయి గిడసబారి మొక్క ఎదుగుదల క్షీణిస్తుంది. తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. జిగురు అట్టలు ఎకరాకు 30 నుంచి 40 వేసుకోవాలి. వేపనూనె (1500 పీపీఎం) ఐదు మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. తెల్లదోమ నివారణకు లీటరు నీటికి ఎసిఫేట్ ఒకటిన్నర గ్రాములు లేదా డయామిథాక్సమ్ 0.3 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా ఫ్లోనికామిడ్ రెండు మి.లీ వంటి మందులను మార్చుకుంటూ పిచికారీ చేయాలి.

● **నల్లతామర :** ఆకుల చిగుర్లు ఎరుపు వర్ణంలోకి మారి ముడుచుకుపోతాయి. గిడసబారి పోతాయి. నివారణకు జిగురు అట్టలు ఎకరాకు 20 నుంచి 30 ఏర్పాటు చేయాలి. ఫిప్రోనిల్ 80 శాతం 40 గ్రాములు ఎకరాకు లేదా ఫిప్రోనిల్+ ఇమిడాక్లోప్రిడ్ 40 గ్రాములు ఎకరాకు, లేదా సయాంట్రనిలిప్రోల్ 90-100 మి.లీ ఎకరాకు లేదా స్పైనటోరమ్ 180 మి.లీ ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



నల్లతామర పురుగులు

విదేశానికి వెళ్లే భాగ్యం లేదా?

అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైన దివ్యాంగురాలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పుట్టుకతో ఒంటి కాలుతో వచ్చిన వైకల్యంతో ఆమె కుంగిపోలేదు.. ఇరుగుపొరుగువారి సూటిపోటి మాటలే ఆమెలో పట్టుదలను పెంచాయి.. ఏదైనా సాధించాలనే తపన పెంచాయి. అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ చదువుకొంది.. ఏడో తరగతిలో ఉన్నప్పుడు పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పుడే ఆమె దృష్టి క్రీడల వైపు మళ్లించి ప్రతిభ చాటుతోంది. అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీలకు దివ్యాంగుల విభాగంలో ఎంపికై దాతల ఆర్థిక సహకారం ఎదురుచూస్తోంది.



డి. భాగ్య

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గొల్లగూడెనికి చెందిన దయ్యాల కొమరమ్మ-కొమరయ్యల కూతురు భాగ్య తన కున్న వైకల్యాన్ని లెక్కచేయకుండా ట్రైసైక్లింగ్, షార్ట్‌పుట్, చెస్, క్యారమ్స్ పోటీల్లో పాల్గొంటోంది. సీనియర్ క్రీడాకారుడు ప్రశాంత్ అందించిన సహకారంతో దివ్యాంగుల విభాగంలో వివిధ క్రీడల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో రాణిస్తోంది. ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి 5 వ తేదీ వరకు ఇండోనేషియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ ‘పారా త్రోబాల్ పోటీల్లో పాల్గొనేందుకు దివ్యాంగుల విభాగంలో ఎంపికైంది. పారా త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఆర్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21 నుంచి 24 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆమెకు అవకాశం లభించింది. విదేశాలకు వెళ్లేందుకు అయ్యే సుమారు రూ. 90 వేలు వ్యయం భరించే ఆర్థిక స్థోమత లేక ఆవేదన చెందుతోంది. 2019లో కూడా ఆమె థాయిలాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పారా ఒలింపిక్ పోటీలకు ఆర్థిక స్థోమత లేక వెళ్లలేకపోయింది. మరోసారి అవకాశం వచ్చినా ఆమెకు లక్ష్మీ కటాక్షం కరవైంది. ఈసారి ఎలాగైన ఇండినేషియాలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాలనే ఆశతో తనకు ఆర్థిక సహకారం అందించాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో విన్నవించారు. జిల్లా క్రీడలు, యువజన శాఖలో బడ్జెట్ లేకపోవడంతో తాము ఆర్థికంగా చేయూతను అందించలేమని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని అధికారులు బదులిచ్చారు. మొదటి విడతగా రూ. 35 వేలు మంగళవారం వరకు, మిగిలిన సొమ్ము నవంబర్ నెల 15 వరకు సమకూరుతేనే వీసా, వసతి సౌకర్యాలు కలుగుతాయని చెబుతూ దాతల సహకారాన్ని ఆశిస్తోంది.

16, 17న క్రికెట్ ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్-23 విభాగంలో ఈ నెల 16, 17 తేదీల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ మండిబజార్‌లో జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. దేశాయిపేట సీకేఎం కళాశాల మైదానంలో పోటీలు ఉంటాయన్నారు. వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లా జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆరు జిల్లాల క్రికెటర్ల ప్రతిభ ఆధారంగా ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 20 నుంచి 23వరకు వరంగల్ నగరంలో జరిగే ఇంట్రా డిస్ట్రిక్(ఉమ్మడి జిల్లాలు) క్రికెట్ టోర్నీలో పాల్గొంటారని వివరించారు.

చికెన్ ధరలు (కిలో వెల రూపాయలలో) వెన్‌కాబ్		
	ఫాం: 126	డ్రెస్డ్: 215
	రిటైల్: 148	స్కిన్‌లెస్: 244

నేటి నుంచి వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిబిరం



రామప్ప ఆలయం

వెంకటాపూర్(ములుగు జిల్లా), న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఖ్యాతిని ప్రపంచ నలుమూలలా చాటిచెప్పేందుకు ఏటా నిర్వహించే వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం-3 మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. యునెస్కో, కేంద్రపురావస్తు, పర్యాటక శాఖలు, ఇంటాక్ భాగస్వామ్యంతో ఈనెల 15 నుంచి 26 వరకు 80 మంది వాలంటీర్లకు శిక్షణ ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు. గుర్తింపు తర్వాత నిర్వహించే మూడో శిబిరంలో రాష్ట్రంలోని టూరిజం క్లబ్‌లకు కూడా ఈ ఏడాది కొత్తగా అవకాశం కల్పించారు. ఏటా డబ్ల్యూహెచ్‌సీ(వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిబిరం) నుంచి ఎంపికైన వారికి మాత్రమే తర్ఫీదు ఇచ్చేది. దాంతో ప్రపంచస్థాయిలోనే కాకుండా స్థానికంగా కూడా రామప్ప కీర్తిని మరింత చాటేందుకు అడుగులు పడ్డాయి. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. జిల్లా పాలనాధికారి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 12 రోజుల పాటు వివిధ శాఖల్లో ప్రావీణ్యం కలిగిన ప్రొఫెసర్లతో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు.

మే నుంచే దరఖాస్తుల స్వీకరణ : ఈ శిబిరం నిర్వహణకు యునెస్కో మే 2024లోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ప్రకటన వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా స్వదేశీయులతో కలిపి 253 మంది www.unesco.whc.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 45 మంది విదేశీయులు ఎంపికయ్యారు. కొన్ని కారణాలతో ఈసారి విదేశీయులెవ్వరూ శిబిరానికి హాజరుకావడం లేదని, ప్రస్తుతం మన దేశంలోని కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 40 మందిని ఎంపిక చేసినట్లు ఇంటాక్ ప్రతినిధి శ్రీధర్‌రావు ‘న్యూస్‌టుడే’కు తెలిపారు. వీరిలో 18 నుంచి 35 ఏళ్లలోపున్న చరిత్ర, కళలు, పురావస్తు, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరు, టూరిజం విభాగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులున్నారు.

యువ టూరిజం నుంచి 40 మంది : రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల ప్రాశస్త్యాన్ని మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన టూరిజం క్లబ్‌ల నుంచి రామప్పలో నిర్వహించే ఈ శిబిరానికి ప్రత్యేకంగా యువటూరిజం(ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి) 40 మందిని ఎంపిక చేసింది. రామప్ప ఖ్యాతిని తెలుసుకునేలా రాష్ట్రం నుంచి కూడా చోటు కల్పించాలని యునెస్కోను కోరడంతో స్థానికులకు అవకాశమిచ్చినట్లు పర్యాటకశాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పర్యాటకం, చరిత్ర విద్యనభ్యసిస్తున్న వారే అధికంగా ఉండటం గమనార్హం.

కిక్కిరిసిన బస్సులు..!

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా వేడుకలు ముగిశాక సొంతూళ్ల నుంచి వారి గమ్యస్థానాలకు బయలుదేరడంతో హనుమకొండ బస్టాండు సోమవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. ప్రయాణికులు బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 850 ప్రత్యేక బస్సులను నడిపించినా.. ఆది, సోమవారాల్లో ప్రయాణ ప్రాంగణాలు నిండిపోయాయి. హైదరాబాద్ వెళ్లే వారి సంఖ్య భారీగా ఉంది. రద్దీని గమనించిన ఆర్టీసీ అధికారులు బస్టాండులోనే ఉంటూ పర్యవేక్షిస్తూ ప్రత్యేక బస్సులను నడిపించారు. సోమవారం రాత్రి వరకు రద్దీ కొనసాగింది. హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్టణం, గుంటూరు, విజయవాడ, మచిలీపట్టణం, నిజామాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ఎక్కువగా నడిశాయి. ఉమ్మడి జిల్లాకు హనుమకొండ బస్టాండు ప్రధాన కేంద్రం కావడంతో ఇక్కడే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కనిపించింది. ఆర్టీసీ డీఆర్ఎం భానుకిరణ్, వరంగల్ 1, వరంగల్ 2 డిపోల మేనేజర్లు మోహన్‌రావు, జ్యోత్స్న తదితరులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. తగిన విధంగా సేవలందించారు. బస్సులన్నీ రద్దీ మార్గాలకు పంపించడంతో జిల్లాలో రోజువారీ నడిచే బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతూ..



హనుమకొండ బస్టాండులో ప్రయాణికుల రద్దీ

తెరుచుకోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ బాధ్యులు

విద్యానగర్, న్యూస్‌టుడే: బోధన రుసుం విడుదల కోరుతూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు సోమవారం బంద్ పాటించాయి. దీంతో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని సుమారు 180 ప్రైవేటు కళాశాలలు మూతపడ్డాయి. దసరా సెలవుల తరువాత నిరవధికంగా బంద్ పాటిస్తామని ఇటీవల కేయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం కళాశాలల బంద్ చేస్తూ హనుమకొండ వాగ్దేవి డిగ్రీ, కళాశాల ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కళాశాలలను బంద్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదివారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి హెచ్చరించినా, యాజమాన్యాలు పట్టించుకోలేదు. కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.300 కోట్లు బోధన రుసుం బకాయిలు రాక నిర్వహణ భారమైనందునే విధిలేక మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వెంటనే బోధన రుసుం బకాయిలు చెల్లించి విద్యార్థులకు, కళాశాలల యాజమాన్యాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ బాధ్యులు ప్రభాకర్ రెడ్డి, వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తేలని విద్యార్థుల లెక్క

భూపాలపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల సంఖ్య కోసం 2012-13లో యూడైస్ పోర్టల్ (ఏకీకృత జిల్లా విద్యా సమాచారం) ప్రవేశపెట్టింది. దీనిని రెండేళ్ల కిందట యూడైస్ ప్లస్‌గా మార్చారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తేల్చ లేక విద్యాశాఖ అధికారులు తల పట్టుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశాల గడువు ముగిసినా ఇంత వరకు తుది జాబితా కొలిక్కిరాలేదు. అయితే పిల్లలు రోజూ పాఠశాలలకు వస్తున్నారా.. వేరే గ్రామాలు, పట్టణాలకు వలస వెళ్లారా.. తదితర ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. రెండేళ్ల క్రితం నుంచి యూడైస్ ప్లస్ ద్వారా విద్యార్థుల సమగ్ర సమాచారం పొందుపరుస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు 50,463 మంది విద్యార్థుల సమాచారం లేదు.

మౌలిక వసతుల కల్పనకు..

బడి ఈడు పిల్లలు చదువుతున్నారా లేక బడి బయట ఉన్నారా.. తదితర విషయాలను యూడైస్ ప్లస్ నివేదిక తెలియజేస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ నివేదిక కొలమానం కానుంది. అదే విధంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు సంబంధించిన ఆధార్ నంబరు అనుసంధానిస్తున్నారు. దీంతో ఒక విద్యార్థి పేరు రెండు చోట్ల ఉండే అవకాశం లేదు. వివరాలు నమోదు చేయడంలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పోర్టల్‌లో నమోదు కాని విద్యార్థుల వివరాలపై ఉన్నతాధికారులు ఆదేశించినా ఫలితం లేదు.

సాంకేతిక సమస్య కారణం..

పాఠశాలల్లో బోగస్ సంఖ్య తప్పించుకునేందుకు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. కొందరికి ఆధార్ కార్డు పొందడం కోసం వేలిముద్రలు పడటం లేదని, మరికొందరు ఉపాధి కోసం వలస వెళ్లి మళ్లీ ఇక్కడే చదువుతున్నారని, ఆధార్ నవీకరణలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని, ఇలా వివిధ కారణాలు చెబుతున్నారు. కొన్ని చోట్ల నెలల తరబడి పిల్లలు హాజరు కాకున్నా వారి రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. పిల్లల సంఖ్య తగ్గితే అక్కడ నుంచి బదిలీ లేదా డిప్యుటేషన్‌పై వేరే ప్రాంతానికి పంపిస్తారనే ఆరోపణలు సైతం వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ అధికారులు దృష్టి సారిస్తే బోగస్ సంఖ్య తేలనుంది. పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా సంఖ్య (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్) కేటాయించి పోర్టల్‌లో నమోదు చేస్తారు. శాశ్వత సంఖ్య ఆధారంగా ప్రవేశం కల్పిస్తే ఎక్కడ చదువుతున్నారో తెలుస్తుంది.



తరగతి గదిలో విద్యార్థులు

ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం

- రాజగోపాల్, విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్

ప్రతి విద్యార్థి పేరుతో పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. జిల్లాలో డ్రాప్ బాక్స్‌లో ఉన్న వివరాలను తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. తమ పరిధిలోని సంఖ్య తేల్చాలని ఇప్పటికే అన్ని పాఠశాలల హెచ్ఎంలను ఆదేశిస్తున్నాం. నిర్లక్ష్యం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు స్పందించి లెక్కలు తేల్చాలి.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సేకరించాల్సిన పిల్లల సంఖ్య

భూపాలపల్లి	ములుగు	వరంగల్
4,009	3,228	12,547
జనగామ	**హనుమకొండ**	**మహబూబాబాద్**
6,368	15,415	9,028

విదేశాల్లో ఉద్యోగాలకు నమోదు చేసుకోండి

కొత్తవాడ, న్యూస్‌టుడే: విదేశాల్లో ఉద్యోగాల కోసం నమోదు(ఎన్‌రోల్‌మెంట్) ప్రక్రియ చేపడుతున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ సహకారంతో జర్మనీలో వివిధ ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఈ నెల 17న ములుగురోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 94400 52592 సంప్రదించాలన్నారు.

రూ.10 నాణెం చెల్లుబాటు

కాజీపేట : రిజర్వ్ బ్యాంకు ఉత్తర్వుల ప్రకారం రూ.10 నాణెం చెల్లుబాటు అవుతుందని కెనరా బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. నాణెం చెల్లుబాటుపై విస్తృత ప్రచారం జరగాలని సూచించింది. నాణేల స్వీకరణలో విముఖత చూపిస్తున్న వారి అనుమానాలను నివృత్తి చేసి వినియోగంలోకి తెచ్చేలా చూడాలని పేర్కొంది.

కరపత్రాల ఆవిష్కరణ



తొర్రూరు, న్యూస్‌టుడే: దేశంలోని 14 రాష్ట్రాల్లో బలమైన నిర్మాణం కలిగి ఉన్న కార్మిక సంఘం టీయూసీఐలో మరోకార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ విలీనం సందర్భంగా ఈనెల 20వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే విలీనసభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి తెలిపారు. సోమవారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో సభ కరపత్రాలు ఆవిష్కరించి, మాట్లాడారు. కార్మికులు, సంఘం బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బీకు, సోమనర్సయ్య, సాయిలు, యాకయ్య, లక్ష్మయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా గార్వీ షరీఫ్



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మత పెద్దలు, యువకులు

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని మదర్‌థెరిసా కూడలి ఆవరణలోని గౌసియా మసీదు కమిటీ, అహ్లే సున్నతుల్ జమాత్ కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గార్వీ షరీఫ్ వేడుక నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రధానవీధుల్లో జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదు ఆవరణలో మహా అన్నదానం చేశారు. ముస్లిం మత పెద్దలు సయ్యద్ అహ్మదరిజ్వీ, షేక్ ఇమ్రాన్, మసీదు కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

అర్జీలు ఇచ్చాం.. ఆదుకోవాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యులు రెక్కల కష్టం చేస్తేనే పూట గడవని కుటుంబాలు మావి.. ప్రభుత్వం నుంచి సహకారం లభిస్తే తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. సమస్యలు ఏమిటో అర్జీల రూపేణా ఇచ్చాం వాటిని పరిశీలించి తమను ఆదుకోండి అంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కలెక్టర్‌ను వేడుకున్నారు. పలు శాఖలకు సంబంధించిన 46 దరఖాస్తులు రాగా జిల్లా పాలనాధికారి వాటిని పరిశీలించి పరిష్కరించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

ఉద్యోగం నుంచి తొలగించారు



కళమ్మ

మైనింగ్ కార్యాలయంలో సుమారు ఎనిమిదేళ్లుగా స్వీపర్‌గా పని చేసిన కళమ్మ ప్రతి నెల రూ. 4,500 వేతనంగా వచ్చేది. దీంతో కుటుంబం గడిచేది. కొన్నాళ్ల కిందట వయస్సు పైబడిందని తొలగించారు. దీంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. తన స్థానంలో కూతురు లేదా కోడలుకు ఉద్యోగం ఇస్తే కుటుంబం గడుస్తుందని జాయింట్ కలెక్టర్‌కు ఇప్పటికే ముడుసార్లు దరఖాస్తు పెట్టుకున్నా న్యాయం జరుగులేదని ఆవేదన వ్యక్తం చేసింది. వేరే వ్యక్తిని నియమించుకొని తన పేరుమీద వస్తున్న జీతాన్ని ఇస్తున్నారని ఆరోపించింది.. ఆ ఉద్యోగం తమ కుటుంబ సభ్యులకు ఇవ్వాలని వేడుకొంది.

మూడు చక్రాల బ్యాటరీ వాహనం ఇప్పించండి



భూక్యా పద్మ

కురవి మండలం పిల్లి గుంట్లతండాకు చెందిన దివ్యాంగురాలు భూక్యా పద్మ భూక్యా బుజ్జి-ఈక్యా దంపతుల కూతురు. ఏడాది వయసు నుంచే కాళ్లు చచ్చుపడిపోయి నడవలేని స్థితిని ఎదుర్కొంటుంది. 90 శాతం వైకల్యం ఉన్న పద్మ బయటకు వెళ్లాలంటే ఎవరైన తోడు ఉండాల్సిందే. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ జీవనం గడుపుతుంటారు. వారికి ఆసరాగా ఇంటికి సంబంధించిన చిన్న చిన్న పనులు చేద్దామనుకుంటే ఒంటరిగా ఎటూ వెళ్లలేని దుస్థితి ఆమెది. అందుకే ఒంటరిగా ఇంటివద్దనే ఉంటుంది. బ్యాటరీ సాయంతో నడిచే మూడు చక్రాల సైకిల్ ఇప్పించాలని 2018 నుంచి సంబంధిత అధికారులను కొన్నేళ్లుగా కోరుతోంది. ఫలితం లేకపోవడంతో ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి తనకు సాయం అందించాలి విన్నవించింది.

ఇతర సమస్యలు:

☛ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మట్టూరి నాగేశ్వర్‌రావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సంబంధిత శాఖల అధికారుల కనుసన్నల్లోనే అక్రమ రవాణా సాగుతుందని సమగ్ర విచారణ జరిపి అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. అక్రమ రవాణాదారులు కూటమి కట్టి అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తుండడం వల్ల నిరుపేదలపై ఆర్థిక భారం పడుతుందన్నారు.

☛ బయ్యారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరుపాలని ఆ గ్రామానికి పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫోర్జరీ సంతకాలు చేసి రుణాలను తీసుకున్నారని ప్రశ్నిస్తే వివిధ రకాల వేధింపులకు పాల్పడుతున్నారంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రభుత్వ శాఖలవారీగా వచ్చిన దరఖాస్తులు	
రెవెన్యూ	22
పంచాయతీ రాజ్	3
గిరిజన సంక్షేమం	3
పురపాలక సంఘం	2
పౌరసరఫరాలు	2
వైద్య శాఖ	2
బ్యాంకులు	2
ఇతర శాఖలు	10

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499
డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

డోర్నకల్, న్యూస్‌టుడే: అందనాలపాడులోని ఒక వీధిలో గల కాలువలో మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది..- రాము

శుభ్రం చేయిస్తాం. - **మున్వర్‌బేగ్, ఎంపీవో, డోర్నకల్**

డోర్నకల్: డోర్నకల్‌లోని న్యూనెహ్రూవీధిలోని వీధి దీపం వెలగడం లేదు. - **రాజు**

మరమ్మతు చేయిస్తాం. - **అశోక్, వార్డు కౌన్సిలర్, డోర్నకల్**

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: కాకతీయనగర్‌కాలనీ నుంచి సిగ్నల్‌కాలనీ వరకు గల ప్రధాన మురుగునీటి కాల్వల్లో వ్యర్థాలన్ని పేరుకుపోయాయి. - **రామస్వామి**

సమాధానం: సిబ్బందిని పంపించి కాల్వలను శుభ్రం చేయిస్తాం. - **డౌలాగర్ స్వాతి, 26వ వార్డు కౌన్సిలర్.**

మహబూబాబాద్ టౌన్: పట్టణంలోని వాసవి ఆలయం పక్కవీధిలో రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలి. - **శ్రీనివాసులు**

సమాధానం: సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. - **తోట రాజేష్, మున్సిపల్ శానిటరీఇన్‌స్పెక్టర్.**

చెత్త తరలింపు

స్పందనకు వందనం

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: పాతబజార్ ఏకశిల హోలిఏంజిల్స్ పాఠశాల వెనుక వీధిలో చెత్త సేకరణ వాహనం రాకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయాయి. తొలగించాలంటూ ఈ నెల బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ తోట రాజేష్ స్పందించారు. సిబ్బందిని, వాహనాన్ని పంపించి చెత్త తరలింపచేశారు.

ఆచార్య సాయిబాబా జీవితం ఆదర్శనీయం

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మార్క్సిజం ప్రభావానికిలోనై ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం అంతర్జాతీయంగా ప్రచారానికి నాంది పలికిన ఆచార్య సాయిబాబా జీవితం యువతరానికి ఆదర్శమని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 90 శాతం అంగవైకల్యం కలిగిన ఆయన వ్యవస్థ అక్రమాలపై. వివక్షతపై నిర్బంధాలపై పోరాడి జీవితం చాలించారన్నారు. ఊపిరి ఉన్నంత వరకు ఉద్యమగానాన్ని, సాహిత్య ఆయుధాన్ని వదలని మన్యం మహానీయుడు సాయిబాబా అని కొనియాడారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు దస్రునాయక్, మహేష్, ఆనంద్, మోహన్, వెంకన్న, మంగీలాల్, భాస్కర్, అశోక్, కిరణ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ఎదుట సాయిబాబా చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భగత్ సింగ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో...

ఆచార్య సాయిబాబా మరణం భారత విప్లవోద్యమాలకు తీరని లోటని భగత్ సింగ్ స్టడీ సర్కిల్ జిల్లా అధ్యక్షుడు కళ్లెం వీరారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద సోమవారం వారు సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. స్టడీ సర్కిల్ బాధ్యులు సోమ గోవర్ధన్, కొమిరె ఉప్పలయ్య, డీటీఎఫ్ నాయకులు ఉపేందర్‌రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు గునిగంటి రాజన్న, రాంమూర్తి, గుంజె హన్మంత తదితరులు పాల్గొన్నారు

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

గూడూరు, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతమైన గూడూరులో ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏడుగురు వైద్యులు ఉండగా వారు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిరుపేద ప్రజలకు వైద్యులు, మందులు అందుబాటులో ఉండే విధంగా చూసి మెరుగైన వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండల నాయకులు ఈసం రామయ్య, కటకం బుచ్చి రామయ్య, గుండగాని సత్తయ్య, బండారి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



సమావేశంలో పాల్గొన్న కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల నేతలు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ కళాశాల ఉపకారవేతనాలు విడుదల చేయాలని నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కళాశాలలో కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల నాయకులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా ఉపకారవేతనాలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అప్పుల ఊబిలో కూరుకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫీజు బకాయిలు చెల్లించే వరకు నిరవధిక బంద్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ వై.కృష్ణప్రసాద్, వీరన్న, విద్యార్థి సంఘాల నాయకులు వెంకటేష్, సూర్యప్రకాష్, సాయికుమార్, మహేష్, రాజేష్, యాకయ్య, శ్రవణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైకుంఠధామం నిర్మించాలని వినతి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ పురపాలక సంఘం పరిధిలోని ఈదులపూసపల్లిలో వైకుంఠధామం నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ వెన్నం లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందించారు. సీపీఎం ఈదులపూసపల్లి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సమ్మెట రాజమౌళి మాట్లాడుతూ వైకుంఠధామం నిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, విజయ్, సర్వేశ్వర్, ప్రభాకర్ రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

మరమ్మతులు ఎప్పుడో..?

జిల్లాలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైన రహదారులకు మరమ్మతు కరవైంది. కురవి, సీరోలు మండలాల్లోని రహదారులు కోతకు గురై ప్రమాదకరంగా మారినా వాటిని పట్టించుకొనే నాథులు కరవయ్యారు. కురవి - మొగిలిచెర్ల మధ్యలో రోడ్డు కోతకు గురైంది. అయ్యగారిపల్లి సమీపంలో 365 జాతీయ రహదారి వంతెన వద్ద ప్రమాదకరంగా మారింది. సీరోలు మండలం కొత్తూరు(సి) గ్రామానికి వెళ్లే దారులు దెబ్బతిన్నాయి. కురవి మీదుగా నిత్యం హైదరాబాద్, సూర్యాపేట, ఖమ్మం పట్టణాలకు వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. ప్రమాదకరంగా మారిన ప్రదేశంలో కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకుండా సంచుల్లో మట్టి నింపి పెట్టారు. నెల రోజులు దాటుతున్నా వాటిని పట్టించుకునే వారు కరవయ్యారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



సీరోలు మండలంలోని కొత్తూరు(సి) రహదారి



అయ్యగారిపల్లి సమీపంలో కోతకు గురైన జాతీయ రహదారి

– న్యూస్‌టుడే, కురవి (డోర్నకల్)

ఒకేసారి రెండు ఉద్యోగాలు..!

కురవి (డోర్నకల్), న్యూస్‌టుడే: నిరుపేద యువకుడు.. కష్టపడి చదివి తల్లిదండ్రుల కలను నిజం చేశారు.. రెండు ఉద్యోగాలు సాధించి తన ప్రతిభ చాటాడు. కురవి మండలం రేకులతండా పంచాయతీ శివారు రామచంద్రాపురానికి చెందిన మరిపెల్లి లచ్చమ్మ, ఎల్లయ్య తమ రెక్కల కష్టంతో కుమారుడు సాయికుమార్‌ను చదివించారు. అతడు కూడా తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను చూసి వేసవి సెలవుల్లో చెట్లు కొట్టడానికి కూలి పనులు వెళ్తూ వచ్చిన డబ్బులతో దుస్తులు, పుస్తకాలు కొనుగోలు చేసి చదువుకున్నాడు. పదో తరగతిలో 470 మార్కులు సాధించాడు. ఇంటర్మీడియట్ హెచ్‌ఈసీలో 533 మార్కులు వచ్చాయి. డిగ్రీ పూర్తి చేసి డీపీటీ పూర్తి చేశాడు. ఈనెల 4న ఐదో జోనల్‌లో బీసీ గురుకులంలో పీఈటీ ఉద్యోగానికి ఎంపికై దంతాలపల్లి గురుకులంలో పోస్టు దక్కించుకున్నాడు. ప్రభుత్వం ఈనెల 9న వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో 6వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఉద్యోగ సాధించాడు. తపన ఉంటే చదువుకు పేదరికం అడ్డురాదని నిరూపించి తోటి యువకులకు ఆదర్శంగా నిలిచాడు. ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



నియామక పత్రాన్ని చూపుతున్న సాయికుమార్

ఎల్‌ఐసీ ఏజెంట్ల ధర్నా

మహబూబాబాద్, న్యూస్‌టుడే: భారతీయ జీవిత బీమా సంస్థలో నూతనంగా జరుగుతున్న మార్పుల వల్ల పాలసీదారులు, ఏజెంట్ల మనుగడకు నష్టం కలుగుతుందని సోమవారం భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ గేట్ ధర్నా నిర్వహించారు. బ్రాంచ్ అధ్యక్షుడు రామచంద్ర మాట్లాడుతూ బీమా సంస్థలో నూతన మార్పులు ఉపసంహరించుకోవాలని కోరారు. వరంగల్ డివిజన్ కోశాధికారి బెల్లంకొండ శ్రీనివాస్, జోనల్ జాయింట్ సెక్రటరీ ఎ.శ్రీరాములు, ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



రాహుల్ (పాతచిత్రం)

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెరుమాండ్ల రాహుల్(25) హైదరాబాద్‌లో ఉంటూ ఔషధ సంస్థలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. నాలుగు రోజుల కిందట దసరా పండగకు స్వగ్రామానికి వచ్చి ఆదివారం తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. సోమవారం అద్దెకు ఉంటున్న ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్య గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



వరుణ్ (పాతచిత్రం)

తొర్రూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన దుర్ఘటన తొర్రూరు డివిజన్ కేంద్రంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన కోన వరుణ్(22) తన మిత్రుడు సాయిసూర్యవర్ధన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై బోర్‌వెల్ వాహనం వెళ్తుండగా, ఒక్కసారిగా సైడ్‌కు తిప్పగా, పక్క నుంచి వెళ్తున్న వరుణ్ వాహనానికి తగలడంతో కిందపడిపోయాడు. వెంటనే వరుణ్ పైనుంచి టైర్ వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిసూర్యవర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి బాబాయ్ రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని వివరించారు.

16 నుంచి బ్రహ్మోత్సవాలు

గార్ల, న్యూస్‌టుడే: ఈ నెల 16 నుంచి మర్రిగూడెం సమీపంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను దేవాదాయ-ధర్మాదాయశాఖ ఈవో సమత ఆధ్వర్యంలో ప్రారంభించనున్నారు. 17న గురువారం సాయంత్రం 4.05 గంటలకు ఆలయం ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. 20న ఆదివారం సాయంత్రం 4.05 గంటలకు కోనేటిలో దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాలతో తెప్పోత్సవం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు 22 వరకు నిర్వహించనున్నారు.



స్వామివారి మూలవిరాట్ విగ్రహం

కృష్ణానదిలో దుర్గాదేవి విగ్రహం నిమజ్జనం

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రంలోని ఆర్యవైశ్య భవనంలో వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. విజయదశమితో ఉత్సవాలు ముగియడంతో ఆదివారం రాత్రి మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నిమజ్జనం కోసం విజయవాడకు తీసుకెళ్లారు. సోమవారం కృష్ణానదిలో దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

గార్ల, న్యూస్‌టుడే: మర్రిగూడెం సమీపంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు సోమవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ నెల 16న ఉదయం 8.15 గంటలకు ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠను ఈవో సమత సమక్షంలో ముఖ్యుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ ఈవో సమత తెలిపారు.

గాలికుంటువ్యాధి నివారణ టీకాలు

గార్ల, న్యూస్‌టుడే: ఈ నెల 15 నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ వి.సురేశ్‌కుమార్ తెలిపారు. 15న బుద్ధారం, ముల్కనూరు 19న గార్ల, 21న సీతంపేట, 24న పోచారం, 28న గోపాలపురం, శేరిపురం నవంబరు 2న మర్రిగూడెం, రాంపురం 7న పుల్లూరులో, 8న మద్దివంచలో, 12న చంద్రగిరిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈదురుగాలులతో కూడిన వర్షం

సంక్షిప్తంగా

దంతాలపల్లి, న్యూస్‌టుడే: దంతాలపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గత కొన్ని రోజుల నుంచి వర్షాలు కురవకపోవడంతో మిర్చి, వేరుసెనగ, వరి సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలులతో దంతాలపల్లి-సూర్యాపేట రహదారిపై తూర్పుతండా శివారులో పలు చోట్ల చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ



నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గుండెబోయిన శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీనివాస్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భారాస నాయకులు శ్రీరామ్‌నాయక్, మార్నేని రఘు, వనజ కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాది మామిడాల సత్యనారాయణ ఉన్నారు.

శ్రీపాల్‌రెడ్డి ఎంపిక హర్షణీయం

నర్సింహులపేట, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ టీఎస్ నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఎంపిక హర్షణీయమని పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎర్ర పూర్ణచందర్, కొండా సంజీవయాదవ్‌లు సోమవారం తెలిపారు. నర్సింహులపేటలో మాట్లాడుతూ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థికి ప్రతి ఒక్కరు మద్దతు తెలిపి ఆయన గెలుపునకు కృషి చేయాలని కోరారు. పీఆర్‌టీయూ టీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి రోజుకో గుడ్డు



తొర్రూరు, న్యూస్‌టుడే: ప్రపంచ జంతువుల దినోత్సవం.. మొక్కల దినోత్సవం మాదిరిగానే కోడిగ్గుకు ఒకరోజు ఉందండోయ్. వరల్డ్ ఎగ్‌డే పురస్కరించుకొని తొర్రూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అమ్మాపురం రోడ్డులో నివాసం ఉండే నిరుపేదలకు సోమవారం ఉచితంగా కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్‌కుమార్ గుడ్డులోని పోషక విలువలు, దానియొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రతిరోజు కోడిగుడ్డు తింటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వివరించారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

గార్ల, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సక్రు డిమాండు చేశారు. మండలంలోని చిన్నకిష్టాపురం, పెద్దకిష్టాపురం, గోపాలపురంలో ఆయన ఈ మేరకు విస్తృత ప్రచారం చేశారు. సమస్యల పరిష్కారంపై మంగళవారం మహబూబాబాద్‌లో నిర్వహించనున్న ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. మండల కార్యదర్శి వీరభద్రం, నాయకులు సీహెచ్. గణేష్, సర్వయ్య, మంగయ్య, సక్రూ తదితరులు ఉన్నారు.

పిడుగుపడి మూడు పశువులు మృతి

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: పిడుగుపడి మూడు పశువులు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని అమనగల్ సమీపంలోని బలరాంతండాలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బలరాంతండాకు చెందిన రైతు పెద్దపులి ఫకీరా తండాలోని రైతు వేదిక సమీపంలోని చెట్టుకు పశువులను కట్టివేశారు. మధ్యాహ్నం సమయంలో పిడుగుపడి ఆవు, ఎద్దుతో పాటు మరో లేగదూడ అక్కడిక్కక్కడే మృతి చెందింది. పశువులు మృతి చెందడంతో ఆ రైతు కుటుంబం కన్నీరు..మున్నీరుగా విలపించారు. సుమారు రూ.1.50 లక్షల నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఫకీరా కోరారు.



మృతి చెందిన పశువుల వద్ద విలపిస్తున్న రైతు కుటుంబం

ఎంఆర్‌సీ ఆవరణలో మద్యం సీసాలు

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్ మండల విద్యా వనరుల కేంద్రం(ఎంఆర్‌సీ) వరండాలో కనిపించిన ఖాళీ బీరు సీసా బహిరంగ మద్యపాన సేవనానికి అద్దం పడుతుంది. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు

ఎక్సైజ్ అధికారుల విచారణ

నర్సింహులపేట, న్యూస్‌టుడే: కల్తీ బీరు విక్రయించారంటూ రామన్నగూడెంనకు చెందిన కొందరు ఆందోళన చేసిన ఘటనపై తొర్రూర్ ఎక్సైజ్ సీఐ తిరుపతి సోమవారం విచారణ నిర్వహించారు. రామన్నగూడెంలోని బీరు విక్రయించిన గొలుసు దుకాణంలోని బీర్లను పరిశీలించి దుకాణదారుడి వాంగ్మూలం, గ్రామంలోని ఆందోళన చేసిన వారి నుంచి వాంగ్మూలం సేకరించి వారితో మాట్లాడి వివరాలు సేకరించారు. కల్తీ జరిగిందన్న బీరును బాధితుల నుంచి స్వాధీనపరుచుకొని ల్యాబ్‌కు పంపనున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. కల్తీ బీరు విక్రయించారని ఆరోపణలున్న నర్సింహులపేటలోని మద్యం దుకాణంలోని మద్యం పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యం అనేది లేదన్నారు. బీరును ల్యాబ్‌కు పంపి ఏమీ జరిగిందనేది నివేదికలో తెలుస్తుందన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపేది...!



దంతాలపల్లి-సూర్యాపేట ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. అంతర్ జిల్లాలను కలిపే రహదారిలో నిత్యం వాహనాల రాకపోకలుంటాయి. దంతాలపల్లిలోని విద్యుత్తు ఉపకేంద్రం ఎదురుగా, కుమ్మరికుంట్ల బస్టాండ్ వద్ద బీటీ రోడ్డు దెబ్బతిని గుంతల మయంగా మారింది. పలువురు వాహనదారులు ఈ గుంతల్లో పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన గుంతలను వెంటనే పూడ్చి వేయించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, దంతాలపల్లి (మరిపెడ)



జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ఎగువ ప్లాట్‌ఫాంపై వేచి ఉన్న ప్రయాణికులు



సికింద్రాబాద్ వెళ్లే రైల్లో ఎక్కేందుకు ప్రయాస

తిరుగు ప్రయాణంలోనూ తిప్పలే..!

పండగల సమయంలో వివిధ ప్రాంతాల్లో ఉండే జిల్లాకు చెందిన ప్రజలు రద్దీగా ఉండే రైళ్లలో ఎంతో ప్రయాస పడి ప్రయాణం చేసి చేరుకుంటారు.. తిరుగు ప్రయాణంలోనూ అవే కష్టాలు తప్పటం లేదు. సోమవారం రాత్రి గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ రైలులో విపరీతమైన రద్దీ వల్ల ఇక్కడి నుంచి వెళ్లే ప్రయాణికులు ఎక్కడానికి ఇబ్బంది పడ్డారు.

– న్యూస్‌టుడే, మానుకోట